క్లుప్తంగా

కేటీఆర్ సభను విజయవంతం చేయండి

ఇల్లెందు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 20న ఉదయం 9 గంటలకు ఇల్లెందులోని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో జరిగే సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు.

23న స్పాట్ అడ్మిషన్లు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని కొత్తగూడెం పట్టణ పరిధి రామవరంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ 23న ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని, ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో బాలికలకు మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిసార్తని వివరించారు. విద్యార్థులు వారి ఒరిజినల్ టీసీ, స్టడీ కండక్ట్, కులం ఆదాయం సర్టిఫికెట్లతో పాటుగా ఆధార్, ఎస్ఎస్సీ మార్కుల మెమోలను వెంట తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 8374161149, 9989879496 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు జడ్సన్ ప్రచారం


ప్రకాశం స్టేడియంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జడ్సన్

కొత్తగూడెంరూరల్: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఇండిపెండెంట్ అభ్యర్థి బక్క జడ్సన్ శనివారం కొత్తగూడెం ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, ప్రకాశం స్టేడియంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో నేను గెలుస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కసుతో అంతర్గత కుట్రతో నన్ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడుగురు మంత్రులను, 34 మంది ఎమ్మెల్యేలను ప్రయోగిస్తున్నారని, ఇది పట్టభద్రులకు అర్థమవుతోందని, ఈ ఉప ఎన్నికలలో ప్రశ్నించే గొంతుకనైన నన్ను బలపరిచి శాసన మండలికి పంపించాలని కోరారు.

ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించండి..


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

టేకులపల్లి: వరంగల్ – నల్గొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హైమారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం టేకులపల్లి మండలం కొత్తతండా(పి) గ్రామంలో పట్టభద్రుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గెలుపుతోనే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావత్ బాలాజీ నాయక్, ఇల్లెందు నియోజకవర్గ, మండల నాయకులు భూక్యా రవి రాథోడ్, బోడ పూన్యా, వాంకుడోత్ హత్తీరామ్, చిక్క వెంకటేశ్వర్లు, గణేష్, సురేష్,అన్వేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా సీతారాములు



కొత్తగూడెంరూరల్/సుజాతనగర్: జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా నాగా సీతారాములను నియమించారు. వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ఎన్నికల కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్ బృందం 18 మందిని కోఆర్డినేటర్లుగా నియమించారు. ఇందులో భాగంగా జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కమిటీ కోఆర్డినేటర్‌గా టీపీసీసీ సభ్యుడిగా నాగా సీతారాములును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధిష్టానం ఇచ్చిన బాధ్యతలతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపిస్తామని తెలిపారు.

అదునులో సేద్యం శ్రేయస్కరం

వరణుడు కరుణించాడు.. చినుకు పలకరించింది. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. నిన్నమొన్నటి వరకు నెర్రెలు చాచి ఉన్న భూములు భారీ వర్షంతో పదునెక్కింది. ఈ ఏడాది వర్షాలు కురుస్తాయో లేదో అన్న ఆందోళనలో ఉన్న అన్నదాతకు మండుటెండల్లో సైతం రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం జీవం పోసింది. మరోవైపు జూన్ మొదటి వారంలో రుతుపవనాలు పలకరిస్తాయని వాతావరణశాఖ ముందస్తు సమాచారం ఇవ్వడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పత్తి విత్తనాలు విత్తేందుకు అచ్చు తోలుతున్న రైతులు

- సకాలంలో దుక్కులు సిద్ధం చేస్తేనే సత్ఫలితాలు
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం
- రేపటి నుంచి విత్తన విక్రయాలు ప్రారంభం

ఇల్లెందురూరల్: సాధారణంగా రైతులు వేసవిలోనే దుక్కులు సిద్ధం చేస్తారు. కానీ ఏ ఏడాది నవంబర్ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో వేసవిలో దుక్కులు దున్నేందుకు నేల సహకరించలేదు. దీంతో ప్రస్తుత వానాకాలంలో కరవు వస్తుందన్న ఆందోళనలో ఉన్న అన్నదాతలో భారీ వర్షంతో ప్రాణం లేచివచ్చినట్లైంది. నేల కూడా పూర్తిగా పదునెక్కినందున ఈ సమయంలో సాగుకు సన్నద్ధమై దుక్కులు సిద్ధం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా సిద్ధంగా ఉన్న దుక్కులపై జూన్ మొదటి వారంలో రుతుపవనాల ప్రభావంతో మంచి వర్షాలు కురిస్తే సకాలంలో మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుకునేందకు అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

విత్తనాల సేకరణ ముఖ్యమే..

మండలంలో ప్రస్తుత వానాకాలంలో పత్తి 19వేల ఎకరాలు, మొక్కజొన్న 23వేల ఎకరాలు, వరి ఏడు వేల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురవడం, చెరువులలోకి వరదనీరు పెద్దమొత్తంలో చేరుకోవడం, భూగర్భ జలాలు కూడా క్రమంగా పెరగడంతో సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. దీంతో ఓవైపు దుక్కులు సిద్ధం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటూనే విత్తనాల సేకరణపై దృష్టి సారించారు. ఇదిలా ఉండగా అన్నదాతలు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు స్థానికంగా ఉండే వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తే లోటుపాట్లు ఎదురైన పక్షంలో సకాలంలో వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసి సత్వర న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుంది. ఇంతేకాకుండా నకిలీ విత్తనాల విక్రయాలపై కూడా అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి.

రేపటి నుంచి విత్తన విక్రయాలు..

ప్రస్తుత వానాకాలానికి అవసరమైన విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే మొక్కజొన్న, పత్తి విత్తనాల ధరలలో స్వల్ప పెరుగుదల ఉందని విత్తన విక్రయ వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వానాకాలానికి అవసరమైన విత్తనాలను బహిరంగ మార్కెట్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి విక్రయించాలని డీలర్లను ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగుకు సిద్ధమైన అన్నదాత విత్తనాల సేకరణలో ఒక అడుగు ముందుకేసి డీలర్లను ముందస్తుగా సంప్రదించి తమకు అవసరమైన విత్తన సంచుల వివరాలు తెలిపి బుక్ చేసుకుంటున్నారు.


దుక్కి దున్నేందుకు అరకతో వెళ్తున్న రైతు

విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి...



ప్రస్తుత వానాకాలానికి అవసరమైన పత్తి, మొక్కజొన్న విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో అందుబాటు ఉన్నాయి. సోమవారం నుంచి విక్రయాలు ప్రారంభించాలని డీలర్లను ఇప్పటికే ఆదేశించాం. వర్షాలు సమృద్ధిగా కురిసినందున వెంటనే దుక్కులు సిద్ధం చేస్తే మేలు. జూన్ మొదటి వారంలో కురిసే వర్షాలకు విత్తనాలు విత్తుకుంటే మంచి దిగుబడులు కూడా వస్తాయి. – సతీష్, ఏఓ, ఇల్లెందు

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఇల్లెందురూరల్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాము శనివారం తెలిపారు. సుభాష్‌నగర్, సుదిమళ్ల, బొజ్జాయిగూడెం, పూబెల్లి, రాఘబోయినగూడెం, రొంపేడు, మొండితోగు పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ, కళాంజలి థియేటర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

24న ఎంపీపీ, వైస్ఎంపీపీ ఎన్నిక

టేకులపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీపీ భూక్యా రాధపై 14 మంది ఎంపీటీసీలలో 11 మంది తిరుగుబావుటా ఎగురవేశారు. జనవరి 17న అవిశ్వాసం నెగ్గింది. ఈనెల 24న ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నారు. రాధ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్ ఎంపీపీ ఎన్నిక 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ.. వైస్ ఎంపీపీ ప్రమోద్‌పై ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టడంతో పదవిని కోల్పోయినట్లు చెప్పారు. 20న నోటిఫికేషన్, 24న ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

మల్లన్న గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం టేకులపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందరికీ సుపరిచితుడైన తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండలంలోని రెండువేల మంది పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించాలని, అన్ని ఓట్లు కాంగ్రెస్‌కే పడేలా కృషి చేయాలని కోరారు. భూక్యా దేవా నాయక్, కోరం సురేందర్ పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి అవకాశం ఇవ్వండి..

జూలూరుపాడు: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల వైరా నియోజకవర్గ సమన్వయకర్త లకావత్ గిరిబాబు కోరారు. జూలూరుపాడులో శనివారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని గెలిపించడం ద్వారా విద్యావంతులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడతారని తెలిపారు. ఈ మేరకు పట్టభద్రులు ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలని చెప్పారు. అనంతరం వెంగన్నపాలెం, జూలూరుపాడుల్లో పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, ఎదళ్లపల్లి వీరభద్రం, చావా వెంకటరామారావు, దుద్దుకూరి కృష్ణప్రసాద్, కొడెం సీతాకుమారి, బానోత్ చిన్నా, భూక్యా సేవానాయక్, చాపలమడుగు రామ్మూర్తి, సాయిల నాగేశ్వరరావు, తాళ్లూరి నవీన్, భూక్యా జవహర్ లాల్, తాళ్లూరి రామారావు, గుమ్మడి వెంకటేశ్వర్లు, వాంకుడోత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


వెంగన్నపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం..


కరీమ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో పేదవారికి ఉపయోగపడే కార్యక్రమాలు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అహ్లెసున్నతుల్ జామత్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ కరీమ్ అన్నారు. సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సభ్యులంతా కలిసి కూలీలైన్‌లోని వారి కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరీమ్ మాట్లాడుతూ.. ఏకగ్రీవంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. పేదవారికి దహన సంస్కరణలు, పేద విద్యార్థులకు విద్య అందించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కార్యక్రమాలు చేపడతామని వివరించారు. సంఘం జనరల్ సెక్రెటరీ షేక్ యాకూబ్ ఖాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఖమర్, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఉసేన్‌ఖాన్, యూత్ ప్రెసిడెంట్ షేక్ నయీం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్ షఫీ, స్పోక్స్ పర్సన్ మహ్మద్ సాధిక్‌పాషా పాల్గొన్నారు.

ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఎస్టీపీపీలో ఇటీవల డీవైఎస్ఈ బూరుగడ్డ కిరిటీ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారుల సంఘం కొత్తగూడెం, ఇల్లెందు బాధ్యులు కోరారు. ఈమేరకు శనివారం కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల జీఎంలు ఎం.శాలేంరాజు, జాన్ ఆనంద్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌బాబు మాట్లాడుతూ సరైన వసుతుల లేకున్నా సంస్థ అభివృద్ధికి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అధికారుల పరిస్థితిని అర్థం చేసుకోకుండా తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో ఆత్మవిశ్వాసం దెబ్బతిని ఉత్పత్తి, ఉత్పాదకతలపై ప్రభావం పడుతోందని తెలిపారు. ఈమేరకు డీవైఎస్ఈ ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ఇంజనీర్ ఆత్మహత్యపై విచారణ చేపట్టాలని సీఎంఓఏఐ బాధ్యుడు సీఎండీకి రాసిన లేఖను శనివారం రాత్రి కొత్తగూడెంలో డైరెక్టర్(పా) శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారుల సంఘం బాధ్యులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, కేశవరావు, రాజీవ్‌కుమార్, సునీల్‌వర్మ, కె.కమలాకర్, నరేష్, శివప్రసాద్, ప్రదీప్, కె.సుమలత, యాదగిరి పాల్గొన్నారు.


ఇల్లెందు ఏరియా జీఎంకు వినతిపత్రం ఇస్తున్న అధికారులు

అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్ష

ఇల్లెందురూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేసేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ సూచించారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన 51 పాఠశాలల్లో మరమ్మత్తు పనుల తీరుపై శనివారం ఎంఈఓ సమీక్షించారు. మండలంలో మంజూరైన 51 పాఠశాలల్లో పనులు వేగవంతంగా సాగుతున్నాయని, వాటిని పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి నూరుశాతం పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముందస్తుగా విడుదల చేసిన నిధులు అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకుంటూ పనులలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు స్వామి, యాదమ్మ, సుధాకర్, ఉమాశంకర్, సీఆర్‌పీలు రవి, వీరన్న, రాందాస్, మండల కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

కూలీల సమస్యలు పరిష్కరించండి..


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని ఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, అఖిలభారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు గుగులోతు రామచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రెండు సంఘాల ఆధ్వర్యంలో టేకులపల్లి ఎంపీడీఓ రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.

అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.750 చెల్లించాలని, పనిముట్లను సమకూర్చాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని కోరారు. నెలరోజుల నుంచి పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు డబ్బులను వెంటనే జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్తీ వెంకటేశ్వర్లు, కొడెం రాజు, జరుపల లక్ష్మా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు అందించాలి

టేకులపల్లి: వచ్చే వానాకాలం సీజన్‌కు రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని, రైతులకు రుణమాఫీ చేసి నూతన రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు నాయని రాజు, టేకులపల్లి మండల కార్యదర్శి డి.వీరబ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో జరిగిన మాస్‌లైన్ సమావేశంలో వారు మాట్లాడారు. అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు చేసిన వాగ్దానాల అమలులో వెనకాడుతోందని, ఆరు గ్యారంటీల ద్వారా అధికారంలోకి వచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై ఈ నెల 23న టేకులపల్లి మండల కేంద్రంలో రైతులతో ర్యాలీ నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించనున్నామని, ఇందులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జరుపల సుందర్, పంతులు, లింగ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజు

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ ప్రధాన లక్ష్యమని, సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామని, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించిందని, ఇందుకు సంబంధించిన గుర్తింపు ధ్రువపత్రం ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం యాజమాన్యం అందజేస్తుందన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నందున కార్మికుల ఉద్యోగ పదోన్నతి, బదిలీలు నిలిచిపోయినట్లు తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించినట్లు చెప్పారు. వారికి ఎన్నికల సమయంలో రావాల్సిన అలవెన్స్‌లు, అందించలేక పోయిందన్నారు. సంస్థ ద్వారా నడుస్తున్న పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టి కార్మికుల పిల్లలు విద్యలో అగ్రగామిగా నిలబడేందుకు యాజమాన్యం కృషి చేయాలన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, రమణమూర్తి, క్రిష్టాఫర్, మాతంగి లింగయ్య, రాములు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలి..




సత్యనారాయణపురం వెళ్లేందుకు ఆటంకంగా ఉన్న అలుగు వాగు, బుగ్గవాగు మీద లోలెవల్ కాజ్ వే


శ్మశానవాటికకు వెళ్లాలంటే ఈ వాగు దాటాల్సిందే..

- తరుముకొస్తున్న వర్షాలు
- ప్రతీ వర్షాకాలంలో తప్పని తిప్పలు
- ముందుకు సాగని పనులు

ఇల్లెందు: వర్షాకాలం తరుముకొస్తోంది.. పట్టణంలో పలుచోట్ల వాగుల మీదబ్రిడ్జిలు కట్టకుంటే స్థానికులకు కష్టాలు తప్పేలా లేవు. ఏటా వర్షాకాంలో రాత్రుల్లో వాగు పొంగినా, చెరువు అలుగు పడినా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. ఎన్నో ఏళ్లుగా ఈ వాగుల మీద హైలెవల్ బ్రిడ్జిలు కట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు. అయితే పాలకులు మారినా పనులు మాత్రం పూర్తి కావటం లేదు. ఏ మూలకు చూసినా ఏదో ఒక పని అసంపూర్తిగానే ఉంటోంది.

సత్యనారాయణపురానికి వాగు పోటు...

పట్టణంలో అంతర్భాగంగా ఉన్న సత్యనారాయణపురంలో 1వ వార్డు, 2వ వార్డు ఉంది. ఈ రెండు వార్డుల ప్రజలకు అలుగు వాగు ఆటంకంగా ఉంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తే వార్డులలోకి వెళ్లటం కష్టంగా ఉంటుంది. వార్డులకు పట్టణంతో రాకపోకలు నిలిచిపోతాయి. ఇక ఇదే సత్యనారాయణపురానికి మరోమార్గం బర్లపెంట మీదుగా వెళ్లే రహదారికి బుగ్గవాగు ఆటంకంగా ఉంది. బర్లపెంట వద్ద లోలెవల్ కాజ్‌వే ఉంది. ఇవి ఏటా వాగు పొంగినప్పుడు పైనుంచి ప్రవహిస్తుంది. చెత్తాచెదారం వాగుకు అడ్డుగా పెట్టి నీరు ప్రవహించకుండా పోటు ఎత్తుతుంది. తద్వారా బర్లపెంట జలమయంగా మారుతుంది. ఇలా సత్యనారాయణపురానికి ఏటా అటు అలుగు వాగు ఇటు బుగ్గవాగు వల్ల ప్రమాదం పొంచి ఉంది.

ఎస్‌జీఓ కాలనీ వైపు వెళ్లాలంటే బుగ్గవాగు మీద లోలెవల్ కాజ్‌వేనే...

పట్టణంలోని నెంబర్–2 బస్తీ నుంచి ఎస్‌జీఓ కాలనీ మీదుగా బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో బుగ్గవాగు మీద లోలెవల్ కాజ్‌వే నిర్మించారు. వాగు పొంగితే ఇక్కడ ప్రమాదం తప్పటం లేదు. రాకపోకలు నిలిచిపోతుంటాయి.

అంతేగాక లోలెవల్ కాజ్‌వే ఖానాలకు అడ్డుగా చెత్తాచెదారంతో పోటువేసి ఎస్‌జీఓ కాలనీ, ఎరుకల బజార్, బండెలమల్లయ్య కుంట, నెంబర్–2 బస్తీలో కొన్ని ప్రాంతాలలో నీరు చేరుతుంది.

హైలెవల్ వంతెనలు అవసరం..

పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న బుగ్గవాగు వల్ల ప్రజలు ఏటా వర్షాకాలంలో ఇబ్బందుల నుంచి ఉపశమనం కలగాలంటే మూడు చోట్ల వాగుల మీద హైలెవల్ వంతెనలు నిర్మించాలి. సత్యనారాయణపురం గ్రామం వద్ద అలుగు వాగు మీద ఒక హైలెవల్ వంతెన, సత్యనారాయణపురం, బర్లపెంట రాకపోకలకు అంతరాయంగా మారిని బుగ్గవాగు మీద హైలెవల్ వంతెన, నెంబర్ –2 బస్తీ నుంచి ఎస్‌జీఓ కాలనీ, ఎరుకల బజార్, బండెలమల్లయ్య కుంటల మీదుగా బస్టాండ్‌లకు వెళ్లే మార్గంలో బుగ్గవాగు మీద హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంటుంది. ఇల్లెందులపాడు నుంచి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో అలుగు వాగు మీద కూడా హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. మృతదేహాల ఖననం కూడా కష్టంగా మారిని ఇల్లెందులపాడు శ్మశానవాటికకు వెళ్లటం దుర్భరంగా మారింది. అక్కడి అలుగువాగు మీద చప్టా గత వర్షాకాలంలో భారీ వర్షాలకు తెగిపోయింది. ఇల్లెందులపాడులోని శ్మశానవాటికకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వీరి కష్టాలు తొలిగించేందుకు అలుగు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.30 లక్షలు కేటాయించారు.

వర్షాకాలం నాటికి పూర్తి చేయాలి..



ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు శ్రద్ధ తీసుకుని వచ్చే వర్షాకాలం నాటికి బ్రిడ్జి పూర్తి చేస్తే ఉపయోగంగా ఉంటుంది. ఇల్లెందులపాడు వాసులు వాగు దాటనిదే శ్మశానవాటికకు వెళ్లలేరు. ఏటా కష్టాలు తప్పటం లేదు. గత ఏడాది తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. ఈ దఫా కూడా అదే కష్టాలు తప్పవంటున్నారు.
– నరహరి, పాత ఇల్లెందు

వానాకాలం వచ్చిందంటే నరకం..



ఏటా వానాకాలంలో సత్యనారాయణపురం వాసులు పట్టణంలోకి రావాలంటే చుట్టూ వాగులే. అలుగు వాగు, బుగ్గ వాగు దాట కుండా పట్టణంలోకి రాలేరు. ఎవరికైనా అనారోగ్యం చేస్తే ఏ వాగు పొంగుతుందో ఎటు నుంచి ప్టటణంలోకి రోగితో వెళ్లాలో అర్థం కాదు. వాగుల వల్ల ప్రమాదం ఉంటుంది. శాశ్వత పరిష్కారానికి బ్రిడ్జిలు నిర్మించాలి.
– మదార్‌బీ, సత్యనారాయణపురం, ఇల్లెందు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాప్రసాద్ -9000327175 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183